



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

-మల్కాజిగిరి, జూన్ 17


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 18 జూన్ 2024 | HYDERABAD






సర్వేనంబర్13లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, సూరారం సీఐ వెంకటేశం తదితరులు

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

నీరు నిలిచే ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయండి

టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్‌వర్క్స్, విద్యుత్, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అందరూ విధుల్లో ఉండాలని సూచించారు. తక్కువ సమయంలో ఒకేసారి భారీ వర్షాలు నమోదవుతున్నందున, 141 వాటర్ లాగింగ్ పాయింట్లలో ప్రత్యేక సిబ్బందిని ఉంచి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. చెట్లు పడిన ప్రాంతాల్లో వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. సమస్య ఉన్న చోటును గుర్తించి అక్కడికి డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే చేరుకొని సహాయక చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్ల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మ్యాన్‌హోళ్ల వద్ద ప్రమాదం జరగకుండా చూసుకోవాలన్నారు.

GHMC

## ఇబ్బందులు రాకుండా.. అత్యవసర బృందాలు

మేడ్చల్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా అత్యవసర బృందాలను ఏర్పాటు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 మున్సిపాలిటీల్లో ఈ బృందాలను నియమించి వర్షాకాలంలో ముందస్తు వర్షకాల ప్రణాళికలను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్లు సూచించారు. ముంపు ప్రాంతాల గుర్తింపు, వరదనీటి ఇబ్బందులు, నాలా పూడికతీత పనులు, మ్యాన్‌హోళ్ల ఏర్పాటు తదితర వాటిని ఎమర్జెన్సీ బృందాలు గుర్తించి.. మున్సిపల్ కమిషనర్లకు సూచించే విధంగా ఆదేశాలు ఇచ్చారు. అలాగే మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోనున్నారు. వానలు పడి ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ బృందాలు తక్షణ చర్యలు తీసుకుంటాయి.



## 'గ్రేట్ ప్లేస్ టు వర్క్'

ఎల్ అండ్ టీ మెట్రోకు గుర్తింపు

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ సంస్థకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు దక్కింది. పనిచేసే చోట సంస్కృతికి సంబంధించి ప్రముఖ అంతర్జాతీయ ప్రాధికార సంస్థ 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా' ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ప్రకటించింది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఈ సర్టిఫికేషన్ గుర్తింపు అమల్లో ఉంటుందని ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పనిచేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారమైన పరిస్థితులను కల్పించడంలో ఎల్ అండ్ టీ మెట్రో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా ఈ సర్టిఫికేషన్ లభించిందన్నారు.

# బెల్టు తీస్తలేరు!

## సిటీలో యథేచ్ఛగా దుకాణాలు

నెలవారీగా మామూళ్లు.. మౌనంగా పోలీసులు

అవినీతి అధికారులపై ఉన్నతాధికారుల దృష్టి

రహస్యంగా వారి వివరాల సేకరణ

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ): నగరంలో బెల్టు షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ..విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అయితే మద్యం దుకాణాలు, బార్లు, కల్లు కంపౌండ్లతో పాటు బెల్టు షాప్‌ల నుంచి కూడా కొందరు లా అండ్ ఆర్డర్, ఎక్సైజ్ పోలీసులకు నెలవారీగా మాముళ్లు వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. అందుకే నగరంలో ఉన్న బెల్టు షాపులపై అటు లా అండ్ ఆర్డర్, ఇటు టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో వరుస ఏసీబీ దాడులు, అక్కడ పనిచేస్తున్న కొందరు అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో నగర పోలీస్ ఉన్నతాధికారులు ప్రక్షాళన మొదలుపెట్టారు. అవినీతికి తావు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. బెల్టు షాపులు, మద్యం దుకాణాలు ఇతరాత్ర నెలవారీగా మాముళ్లు తీసుకుంటూ.. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. అలాంటి అధికారుల వివరాలను రహస్యంగా సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే టాస్క్‌ఫోర్స్ పోలీసుల్లో కూడా కదలిక వచ్చింది. ఇందులో భాగంగా బెల్టు షాపులపై దాడులు చేసి.. కొన్ని కేసులు నమోదు చేశారు. అయితే బెల్టు షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయి..? ఎవరు నిర్వహిస్తున్నారనే సమాచారం స్థానిక పోలీసులకు పక్కాగా తెలిసి ఉన్నా.. ఇన్నాళ్లు పట్టించుకోలేదు. ఇప్పుడేమో.. నెమ్మదిగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిద్రలేచి దాడులు ప్రారంభించారన్న విమర్శలున్నాయి. నగరంలోని ఛత్రినాక, కుల్సుంపురా, కాచిగూడ, బోరబండ, సైదాబాద్ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో భారీ స్థాయిలో బెల్టు షాపులున్నాయి. కొందరు కిరాణా దుకాణాలను అడ్డుపెట్టుకొని వీటిని నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే కాకుండా.. రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు ఉండటం గమనార్హం.





### చూసీచూడనట్లు వదిలేస్తూ..

మద్యం దుకాణాల నుంచి ఆదాయాన్ని పెంచడం ఎక్సైజ్ శాఖ ఒక పనిగా పెట్టుకొని.. విక్రయాలు ఎక్కువగా చేసే వారిని ప్రోత్సహిస్తున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇదే అదునుగా స్థానిక పోలీసులు సైతం చూసీ చూడనట్లు వదిలేయడం, నెలవారీగా అందిన కాడికి మాముళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏయే దుకాణాల్లో ఏమి విక్రయాలు సాగుతున్నాయనే పక్కా సమాచారం స్థానిక పెట్రోలింగ్ సిబ్బందికి ఉంటుంది. అయితే కిందిస్థాయి నుంచి పై అధికారుల వరకు ఒక్కో విధంగా మాముళ్లు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. జాతీయ సెలవు దినాలు, ఎన్నికలు, పండుగలు తదితర సందర్భాల్లో శాంతి భద్రతల నేపథ్యంలో ప్రభుత్వం మద్యం దుకాణాలను మూసివేయిస్తుంది. ఆ సమయాల్లో కొందరు దుకాణాదారులు ఎక్కువ స్టాక్‌ను బెల్టు షాపులకు తరలించి.. ప్రత్యేకంగా ఆ రోజు జోరుగా వ్యాపారం చేయిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. సాధారణ దుకాణాలు రాత్రి 10.30 గంటలకే బంద్ అయితే, బెల్టు షాపుల్లో మాత్రం 24/7 మద్యం దొరకుతున్నది. ఇదంతా పోలీసులకు తెలిసినా.. నెలవారీగా అందుతున్న మామూళ్ల వల్లే ఆ వైపు చూడటం లేదన్న విమర్శలున్నాయి.

## భూ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు

దుండిగల్, జూన్17: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం(సర్కిల్) డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 13లోని ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఈనెల 12న 'రాత్రికి రాత్రే కబ్జా' పేరుతో 'నమస్తే'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు భూ ఆక్రమణలపై పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు భూ ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. భవిష్యత్‌లో మరోసారి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు చేపడుతామన్నారు. కాగా, కబ్జాకు గురైన సర్కారు భూములను మేడ్చల్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి, సూరారం సీఐ వెంకటేశంతో కలిసి సోమవారం పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన స్థలాన్ని పరిశీలించి.. రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరం పైచిలుకు స్థలాన్ని కాపాడటంతో పాటు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూరారం పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. కబ్జాదారులు ఎంతటివారైనా ఉపక్షేంచొద్దని స్పష్టం చేశారు. సదరు భూములను ఆక్రమించడంతో పాటు వాటిని ప్రోత్సహిస్తున్న శ్రీనాథ్, శోభారాణి, సంధ్యారెడ్డి, కుమారి, విజయ, శోభ, హేమాశ్రీలతో పాటు పలువురిపై కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమార్కులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు.



సోమవారం ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ నిర్మాణ కర్రపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు

## 70 అడుగుల మట్టి గణపతి

ఖైరతాబాద్ గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 70 ఏండ్లు

అన్ని అడుగుల్లోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయం

నేత్రపర్వంగా కర్ర పూజ..

సంయుక్తంగా ఉత్సవాల నిర్వహణకు సభ్యుల సమ్మతం

త్వరలో నూతన కమిటీ ఏర్పాటు: ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, జూన్ 17 : ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహం ఈ ఏడాది 70 అడుగుల్లో రూపుదిద్దుకోనున్నది. ఈ నేపథ్యంలో నిర్జల్ ఏకాదశి తిథిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం కర్రపూజ మహోత్సవాన్ని వినాయక విగ్రహ ఏర్పాటు మండపం వద్ద వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్ వేడుకలను ప్రారంభించారు. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తైన మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకటించారు. త్వరలోనే నమూనా విడుదల చేస్తామన్నారు. వినాయక చవితికి వారం రోజుల ముందే స్వామి వారి విగ్రహం సిద్ధమవుతుందన్నారు. కర్రపూజలో పాటు గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన తామే నిర్వహిస్తామంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీలు వేర్వేరుగా ప్రకటించాయి. దీంతో సభ్యుల మధ్య కొత్త వివాదానికి తెరలేపింది. అయితే సోమవారం జరిగిన కర్రపూజ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇరు వర్గాలతో చర్చించి.. సభ్యులందరూ సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు సభ్యులందరూ అంగీకరించగా, ఎలాంటి గొడవకు తావు లేకుండా కర్రపూజ సజావుగా సాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఖైరతాబాద్ గణేశ్ నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. ప్రస్తుతం అడ్‌హక్ కమిటీగా కార్యక్రమాలను నిర్వహిస్తామని, రెండు మూడు రోజుల్లో సభ్యులందరితో సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సారి గణపతిని దర్శించుకునేందుకు వచ్చే ప్రతి భక్తుడికి ప్రసాదాన్ని అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

### 1954లో ఒక్క అడుగుతో..

ఖైరతాబాద్ గణేశుడికి 70 ఏండ్ల చరిత్ర ఉన్నది. 1954లో ఒక్క అడుగుతో ప్రారంభించి.. సుమారు 60 అడుగులకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టగా, గణేశుడిని 70 అడుగుల్లో ప్రతిష్ఠించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఖైరతాబాద్ గణేశుడి చరిత్రలో మొదటి సారిగా 70 అడుగుల విగ్రహానికి అంకురార్పణ జరిగింది. పీవోపీ వినియోగించకుండా పూర్తిగా మట్టితో తయారు చేసిన ప్రతిమను ప్రతిష్ఠిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితీ కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు, కోశాధికారి శశిధర్, డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సింగరి రాజ్ కుమార్, సందీప్ రాజ్, మహేశ్ యాదవ్, మహేందర్ బాబు, జి. కృష్ణా యాదవ్, మధుకర్ యాదవ్, వి. ప్రవీణ్, పృథ్వీరాజ్, నాగేశ్, రాంరెడ్డి, అశోక్, రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ రోడ్డులో రహదారిపై విరిగిపడిన చెట్టు కొమ్మ





# గంట వానకే.. అతలాకుతలం



ధరమ్‌కరం రోడ్డులో జలమయమైన రహదారి



మలక్‌పేటలో..



అమీర్‌పేటలో..

సిటీబ్యూరో: ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో సోమవారం గంట పాటు కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలమైంది. బలమైన గాలుల ధాటికి కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టోలిచౌకి నుంచి గోల్కొండ రహదారిలోని ఎండీ లైన్స్‌లో వందేండ్ల నాటి మర్రి చెట్టు కుప్పకూలింది. మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్టు కింద నిల్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి 9 గంటల వరకు నగరంలోని లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 5.80 సెం.మీలు, మెహిదీపట్నంలో 5.70, యూసుఫ్‌గూడ కృష్ణానగర్, ఆసిఫ్‌నగర్‌లో 5.25, జూబ్లీహిల్స్‌లో 4.68, ఫస్ట్‌లాన్సర్ అహ్మద్ నగర్, బంజారాహిల్స్‌లో 4.63, షేక్‌పేట, ఉప్పల్‌లో 3.88, ముషీరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో 3.55, మాదాపూర్, విజయనగర్‌కాలనీలో 3.40, బోరబండ, పటాన్‌చెరులో 3.20, హిమాయత్‌నగర్, నాంపల్లి మూసాపేటలో 3.18, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, బాలానగర్‌లో 3.0, మలక్‌పేట, అంబర్‌పేట, హఫీజ్‌పేటలో 2.9 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది. నైరుతి వైపు నుంచి వీస్తున్న గాలుల వల్ల రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

## రేపటి నుంచి ఎమర్జెన్సీ పంపింగ్

సిటీబ్యూరో, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : ఎత్తిపోతల ద్వారా నగరానికి గోదావరి జలాల తరలింపు ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభం కానున్నది. బుధవారం నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి అత్యవసర పంపింగ్‌తో నగరానికి రోజూ 168 ఎంజీడీలను తరలించనున్నారు. ఈ మేరకు ఏడు పంపులను అధికారులు సిద్ధం చేసి ట్రయల్ రన్ పూర్తి చేశారు. సోమవారం రోజు అన్ని పంపులను ఆన్‌చేసి సాధ్యసాధ్యాలను పరిశీలించిన అధికారులు.. బుధవారం నుంచి పూర్తి స్థాయిలో ఎమర్జెన్సీ పంపింగ్‌కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గోదావరి జలాల తరలింపులో భాగంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ నీటి నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా.. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లిలోకి వరద నీరు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో నీటి నిల్వలు 4.5 టీఎంసీల మేర ఉండగా.. ముందస్తుగానే అప్రమత్తమైన జలమండలి అధికారులు.. ఎల్లంపల్లి రిజర్వాయర్ బ్యాక్ చానల్ ముర్మూర్ ఫోర్ సోర్ వద్ద అత్యవసర పంపింగ్ మోటర్లను ఏర్పాట్లు చేశారు. ఒక్కో పంపు నుంచి 25 క్యూసెక్కుల మేర తొలుత ఎత్తిపోసి.. గోదావరి జలాలను అందించి తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు తగ్గిన కొద్దీ మరిన్ని పంపులను ఏర్పాటు చేసే అవకాశమున్నదని, అయితే ఎల్లంపల్లిలోకి వరద కొద్ది రోజుల్లోనే ప్రారంభమవుతుందన్న ఆశాభావంలో అధికారులు ఉన్నారు. మొత్తంగా గోదావరి జలాల తరలింపు ప్రక్రియలో 2016లో ఒక్కసారి మాత్రమే ఎల్లంపల్లి నుంచి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించిన సందర్భాలు ఉన్నాయి.